

# ఒకరికి ఒకరు!

ఎమ్. వి. వి. సత్యనారాయణ

**కాలింగ్ బెల్** గణగణ లాడింది.

ఫ్యాన్ స్వింగ్ డోర్స్ తెరచుకుని లోపలకు వెళ్ళాడు. ప్రొప్రయిటర్ రంగారావు కుర్చీలో వెనక్కి వాలాడు. రంగారావు చేతిలో సిగరెట్టు వెలుగుతూంది. గదిలో సువాసనల పొగ అలముకుని ఉంది.

'అది సిగరెట్టా? అగరువత్తా?'

ఫ్యాన్ తల విదిలించాడు. తాను ఎన్నో సార్లు ఆలోచించాడు. కాని, ఆ సిగరెట్టు ఏ దేశానిదో తనకి తెలియలేదు.

"పిలిచారా, సార్?" అడిగాడు ప్యూన్.

"మిస్ టీనా ఈ రోజు రాలేదు కదా!" అన్నాడు ప్రొ. రంగారావు.

"రాలేదు, సార్!"

"కారణం తెలుసా?"

ప్యూన్ తెల్లబోయాడు. టీనా అమ్మగారు సెలవు చీటీ తన చేతికే ఇచ్చారు. చీటీలో ఆమె కారణం రాసింది. ప్రొ. రంగారావు చదువుకునే ఉంటారు.

"తెలియదు, సార్!"

"నీకు ఇల్లు తెలుసా?"

"మా ఇంటి మీదనే, సార్, వాళ్ళ ఇంటికి దారి!"

"సైకిలు తెచ్చావా?"

"తెచ్చాను, సార్!"

"ఇంటికి వెళ్ళి..." రంగారావు సిగరెట్టును యాష్ ట్రేలో కుక్కాడు. "కారణం తెలుసుకు రా!"

"అలాగే, సార్!"

"త్వరగా రా. వెళ్ళు!"

ప్యూన్ బయటికి నడిచాడు. తనలో తాను నవ్వుకున్నాడు. టీనా అమ్మగారికి ఏమీ కాలేదు. ప్రొ. రంగారావు కంగారు పడుతున్నాడు. ఆయన కూతురు వయసు ఉంటుంది టీనా అమ్మగారికి.

"సూరయ్యా! లీవు లెటర్ ఇవ్వు." అంది ఉదయాన్నే.

తాను ఉదయానే ఆమె ఇంటికి వెళ్ళి పాలు పోస్తాడు.

"ఏమండీ, అమ్మగారూ!" అడిగాడు తాను.

"ఈ రోజు ఆఫీసుకు రా బుద్ధి కావడం లేదు."

ఆమెకి ఆఫీసుకు రా బుద్ధి వేయని కారణం తనకి తెలుసు!

రంగారావు ఆమెను తినేసే లాగా చూస్తున్నాడు.

టీనా అమ్మగారికి ఇరవై ఏళ్ళు ఉంటాయి. సన్నగా — బంగారు తీగలాగా ఉంటుంది. ఒంటి రంగుకు సరిపడేలాగా మాక్సీ వేసుకుంటుంది. ఎత్తు మడమల జోళ్ళు. గుర్రపు తోక లాగా ఒంపు తిరిగిన హెయిర్ డ్రెస్సింగ్. సున్నితంగా మాట్లాడుతుంది. సున్నితంగా నడుస్తుంది.

అంతా సున్నితమే. పేరుకూడా! టీనా!

ప్యూన్ సూరయ్య ఆఫీసులోంచి బయటకు నడిచాడు. టీ కొట్లో కూర్చున్నాడు. హాఫ్ టీ ఆర్డరిచ్చాడు. జేబులోంచి బీడీ తీశాడు. టీ తాగి బీడీ ముట్టించాడు.

రంగారావుగారికి అదేం బుద్ధి! ఆయనకి యాభై ఏళ్ళు ఉంటాయి. ఆయనకీ, టీనా అమ్మగారికీ ముప్పయి ఏళ్ళ తేడా! అయినా రంగారావుగారికి అందమైన భార్య ఉంది. కాస్త లావుగా ఉంటుంది. అయితే ఏం? ఆమె మొహంలో లక్ష్మి కళ! భర్త పట్ల ఆప్యాయత చూపిస్తుంది. తనకి ఆమె బాగా తెలుసు.

అరగంట గడిచింది.

సూరయ్య తిరిగి ఆఫీసుకు వెళ్ళాడు. ప్రొప్రయిటర్‌గారి రూమ్‌లో ప్రవేశించాడు.

"ఇంట్లోనే ఉన్నారండి! ఏదో పని ఉండి..."

రంగారావు ఆత్రతగా చూస్తున్న వాడల్లా లేచి నిలబడ్డాడు.

"పని అయి ఉండదు. ఒంట్లో నలత అయి ఉంటుంది!"

"కాదు, సార్! పనే."

"పద, చూసి వద్దాం!"

సూరయ్య గొంతులో వెలక్కాయ పడింది.

"చాలా పని తొందరలో ఉన్నా ర్సార్!"

"ఏం పని?"

"పనా? పనా? పనంటే, సార్..."

రంగారావు టేబులు వెనకనుండి కదిలి వచ్చాడు.

"ఒంట్లో బాగుండక పడుకుని ఉంటుంది. నీతో అలా చెప్పమని ఉంటుంది." రంగారావు బయటకు నడిచాడు.

సూరయ్య ఊపిరి బిగబట్టి ఆయన వెనక పడ్డాడు.

టీనా ఇంటికి వెళ్ళకుండా తను వెళ్ళినట్లు అబద్ధం చెప్పాడు. ఇప్పుడు తన అబద్ధం బయట పడుతుంది.

"సూరయ్యా!" మేనేజర్ రహస్యంగా పిలిచాడు. అతడి చేతిలో సైకిలు తాళం చెవి!

తన సైకిలే! మేనేజర్ తీసుకు వెళ్ళాడు. ఇప్పుడు ఆ తాళంచెవిని చూస్తే ప్రొ. రంగారావుకు తన అబద్ధం బయట పడుతుంది.

సూరయ్య చప్పున అతడి చేతిలోంచి తాళం చెవి లాక్కున్నాడు.

ప్యూన్ వైపు మేనేజర్ తెల్లబోయి చూశాడు.

రంగారావు తన కారులో సూరయ్యను ఎక్కించుకుని వెళుతున్నాడు.

అంతవరకూ చూసి మేనేజర్ వెనక్కు తిరిగాడు.

'ఏమైనా ఇప్పటికీ సూరయ్య ప్రొప్రయిటర్‌గారి ప్యూన్.'

## 2

టీనా ఉలిక్కి పడింది. మంచం మీద ఇటు తిరిగింది.

ఎవరో తలుపు కొడుతున్నారు.

ఈ సమయంలో తన ఇంటికి వచ్చే వాళ్ళు లేరు.

టీనా లేచింది. తలుపు తెరవడానికి బయలుదేరింది.

"చూడమ్మా, టీనా! ఎవరో వచ్చారు" అంది తల్లి. ఆమె వంట పనిలో ఉంది.

టీనా తలుపు తెరిచింది. రోడ్డు మీద కారు ఆగి ఉంది.

తలుపు అవతల ప్రొప్రయిటర్ రంగారావు నిలబడి ఉన్నాడు.

"మీరా? అరె! రండి, సార్! ఏమిటి ఇలా వచ్చారు?" తడబడింది టీనా.

"ఏం? రాకూడదా?" రంగారావు గుంభనంగా నవ్వాడు.

టీనా మాట్లాడకుండా దారి ఇచ్చింది. రంగారావు లోపలకు వచ్చాడు.

"మా ఇల్లు ఎవరు చూపించారు, సార్?"

"సూరయ్య."

"అతడు కూడా ఉన్నాడా?" టీనా వెనక్కి తిరగబోయింది.

"లేదు. పంపించేశాను!"

రంగారావుకు కుర్చీ చూపించింది.

టీనా తల్లి వంటింట్లోంచి వచ్చింది.


టీనా తల్లిని రంగారావుకు పరిచయం చేసింది.

తల్లి వంటపనిలోకి వెళ్ళిపోయింది.

"టీనా! ఏమిటి పని? నాతో చెప్పకూడనిదా?" అడిగాడు రంగారావు.

టీనా అయోమయంగా చూసింది. అంతలోనే తేరుకుంది.

"పని! ఇంటిపని పేరుకు పోయింది, సార్! ఫ్రెండ్సుకు ఉత్తరాలు కూడా రాయడం లేదు.



అవన్నీ ఈ రోజున చేయాలి!"

"నువ్వు రాకపోతే ... ఏమిటో నాకు చాల వెలితిగా ఉంది!"

టీనాకు విచిత్రంగా ఉంది. తను పనిచేసే ఫరం ప్రొప్రయిటర్ తనంటే విపరీతమైన అభిమానం చూపిస్తున్నాడు.

ఈ అభిమానానికి తాను ఏ రకంగా వ్యాఖ్యానం ఇచ్చుకోవాలి? ఏమో ... తనకి ఇంకా జీవితం ఆపాటి అనుభవం నేర్పలేదు.

టీనా ఇబ్బందిగా కదిలింది.

"నేనంటే మీకు అభిమానం!"

రంగారావు హాయిగా నవ్వాడు.

"మీకు నా వయసు కూతురు ఉండి ఉండాలని పిస్తుంది, సార్!"

రంగారావు మొహంలో నవ్వు మాయమయింది.

"నాకు పిల్లలు లేరు, టీనా?"

"సారీ, సర్!"

గుమ్మంలో అలికిడయింది. టీనా, రంగారావు తలెత్తి చూశారు. నలుగు రైదుగురు అమ్మాయిలు ఇంట్లోకి పరుగెత్తుకు వచ్చారు. రంగారావుని చూసి ఆగారు.

"హాయ్ ... టీనా!" అన్నారు వాళ్ళు.

టీనా లేచింది.

రంగారావుకు వాళ్ళను పరిచయం చేసింది.

"మీ ఫ్రెండ్స్ ఎక్కడయినా పని చేస్తున్నారా?" అడిగాడు రంగారావు.

"లేదు, సార్! కాలేజిలో చదువుకుంటున్నారు!"

"వెరీ గుడ్!"

"టీనా!" పిలిచింది మాధవి—అయిదుగురిలో ఒక అమ్మాయి.

"చెప్పు."

"రవి కారు తెచ్చాడు. కొత్త ఇంగ్లీషు పిక్చర్‌కి టికెట్స్ బుక్ చేయించాడు. నీకోసం వచ్చాం!"

"అరె, ముందు చెప్పలేదు."

"ఆఫీసుకు ఫోన్ చేశాం. నీవు సెలవు పెట్టినట్టు చెప్పారు."

టీనా ఇబ్బందిగా కదిలింది.

రంగారావుకు పరిస్థితి అర్థమయింది.

"టీనా! నువ్వు పిక్చర్‌కి వెళితే వెళ్ళు." లేచాడు రంగారావు.

"మీరూ రండి, సార్!" అంది మాధవి.

"ఫరవాలేదు. మీరు వెళ్ళండి. థాంక్స్."

టీనా అతడి వెంట కదిలింది.

రంగారావు కారుని సమీపించాడు. తన కారు ప్రక్కనే మరో కారు ఆగి ఉంది. ఆ కారులో పాతికేళ్ళ యువకుడు నవనవలాడుతూ కనిపించాడు. అతడి జుత్తు ఉంగరాలు తిరిగి ఉంది.

డబ్బపండు చాయలో ఉన్నాడు. తీర్చి దిద్దిన కళ్ళూ, ముక్కూ, కళ్ళకి లేత నీలిరంగు అద్దాలూ ...

రంగారావు చప్పున తన కారు డోర్ తెరిచాడు.

'నాన్సెన్స్ ...' గొణుక్కున్నాడు. యాక్సిలేటర్ బలంగా తొక్కాడు. కారు ముందుకు దూకింది.

**3**

కృష్ణకుమారి భర్తను విడ్డూరంగా చూచింది.

రంగారావు అద్దం ముందు నిలబడి పావుగంట అవుతోంది.

## ఏది బాగు

"ఈ లేనితనంతో ఎందుకు జీవించాలి? రాజాశ్రయం పొందే మార్గం చూపిస్తాను, బావా!" అని శ్రీనాథుడంటే—"సత్కావుల్ హాలికులైన నేమి, గహనాంతర సీమల కందమూల కౌద్దాలికులైన నేమి?" అని తిరస్కరించాడు అలనాటి పోతన మహాకవి.

దేశ కాలావధులతో నిమిత్తం లేకుండా ప్రపంచంలో ఎల్లెడలా ఇటువంటి వారుంటారనే విషయానికి తార్కాణంగా వేలాది ఏళ్ళ క్రితం గ్రీసు దేశంలో జరిగిన ఈ వృత్తాంతాన్ని గమనించండి.

ఒకమారు డయోజినిస్ అనే వేదాంతి పులుసు వండుకోడానికి కొన్ని చిరుధాన్యాలు కడుక్కుంటున్నాడు. ప్రభువులను పొగిడి సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతున్న అరిస్టిప్పస్ అనే వేదాంతి డయోజినిస్‌ను చూచి "ప్రభువుల్ని కీర్తించటం గనక కాస్త అలవాటు చేసుకుంటే ఈ చిరుధాన్యాలు తినాల్సిన ఖర్మ ఉండదు కదటయ్యా?" అని హేళన చేశాడు.

అరిస్టిప్పస్‌తో ప్రుటువుగానైనా సూటిగానే సమాధానం చెప్పాడు డయోజినిస్. "ఈ చిరుధాన్యాలతో కడుపు నింపుకోడం అలవాటు చేసుకుంటే ప్రభువుల్ని కీర్తించాల్సిన ఖర్మేపట్టదుగదటయ్యా?"

-ప్రసీల్

రంగారావు ట్వీడ్ పాంటులోకి టెరిలిన్ షర్ట్ జొనిపాడు. వెడల్పాటి బెల్ట్ నడుముకు బిగించాడు. మొహానికి ఇమామీ స్నో దట్టించాడు. దానిమీద ఖరీదయిన ఫేస్ పౌడర్ పూశాడు. కనుబొమలు దిద్దుకున్నాడు. ఎర్రబడుతోన్న తల వెంట్రుకలకూ, మీసాలకూ రంగు అద్దాడు. కాళ్ళకి అంబాసడర్ షూ.

"డైరెక్టర్ల మీటింగ్ ఉందా?" అడిగింది కృష్ణకుమారి.

రంగారావు ఆమెను విడ్డూరంగా చూశాడు.

"నువ్వు ఇంతసేపూ ఇక్కడే ఉన్నావా?" అడిగాడు.

కృష్ణకుమారి తల పంకించింది.

తన భర్త అలంకరణలో మునిగాడు. తన ఉనికిని గూడా గుర్తించనంత పరాకులో ఉన్నాడు.

తన భర్తను ఇంత పరాకుగా ఎన్నడూ చూడలేదు.

"నేనంటూ ఒకతెను ఉన్నానని మీకు గుర్తు లేదు!" మురిపెంగా అంది కృష్ణకుమారి.

రంగారావు నుదురు చిట్లించాడు.

ఆమె మురిపెం తనకి హితవుగాలేదు. తన బుర్రలో బంగారు తీగె అందం మెరుస్తోంది. ఆ మెరుపు ముందు తన భార్య తేలిపోతూంది.

కృష్ణకుమారి తనకి భుజాల ఎత్తుకు వస్తుంది. పొట్టిదనానికి తోడు లావు. తమ ఇద్దరి పెళ్ళయి పాతికేళ్ళు! ఈ పాతికేళ్ళలో ఆమె బాగా లావెక్కింది. తమకి ఇద్దరే ఇద్దరు పిల్లలు పుట్టారు. సన్నగా ఉండేది. గాలి కొట్టిన బెలూన్‌లాగా లావుపాటి చేతులూ కొవ్వు చేరిన నడుమూ, దానికితోడు నెరిసిన చెంపలూ ...

రంగారావు తన చెంపలు తడుముకున్నాడు.

తను ఆమె కంటె అయిదేళ్ళు పెద్ద. తన చెంపలూ నెరిశాయి.

అయినా తాను ఆమె లాగా అడ్డంగా బలిసి పోలేదు.

తనలో ఇంకా యౌవనం వేడి ఉంది.

ఆమెలో సంసార తాపత్రయం ఉంది.

అందుకే తన కళ్ళకి ఆమె భార్య లాగా కనిపించడం లేదు. తనకి పిల్లలను కన్న ఒక స్త్రీ. ఆమె ఒళ్ళు తనసొని కోరికలకు అనకట్ట!

రంగారావు తల విదిలించాడు.

అలా ఎన్నడూ కాకూడదు! కృష్ణకుమారికి తాను ఏ లోటూ రానివ్వడు. తన పిల్లలకు ఆమె సమర్థవంతమైన మాతృమూర్తి.

"ఏమి టలా ముస్తాబయ్యారు?" నవ్వుతూంది భార్య. ఆమె బుగ్గలు లావుగా కదులుతున్నాయి.

కళ్ళు చుట్టూ వలయాలు!

రంగారావు మాట్లాడలేదు. బయటకు నడిచాడు.

కృష్ణకుమారి భర్త వంకే చూస్తూంది.

పోర్టికోలో కారు బయలుదేరింది.

ఆఫీసు ముందు కారు ఆపాడు రంగారావు. చకచక భవనంలోకి నడిచాడు. తన మనసులో హుషారుగా ఉంది. వయసు ఇరవై తగ్గినట్టు అనిపిస్తూంది.

హుషారుగా తన గదిలోకి నడిచాడు. ఫ్యాన్ తెల్లబోతున్నాడు.

తన కింది స్టాఫ్ తనని తేరిపారచూడటం తనకి తెలుస్తూంది.

గదిలో టీనా టైపు చేస్తూంది.

రంగారావును చూస్తూనే టీనా లేచి నిలబడింది.

"గుడ్ మార్నింగ్, సర్!" అంది టీనా.

"వెరీ గుడ్‌మార్నింగ్!" హుందాగా సీట్లో కూర్చున్నాడు.

"యుహా . . ." వాలి క్కరుచుకుంది టీనా.

రంగారావు ఆమె వైపు ప్రోత్సాహకరంగా చూశాడు.

"మీరు చాలా చిన్నవారుగా కనిపిస్తున్నారు, సర్!" అంది టీనా.

రంగారావు గుండె గొంతులోకి వచ్చినట్టయింది.

"నీ కోసం!" అన్నాడు. కాని, ధ్వని పైకి రాలేదని వెంటనే తెలుసుకున్నాడు. తృప్తిగా నవ్వాలని ప్రయత్నించాడు. కాని, బలవంతంగా నవ్వగలిగాడు.

లంచ్ సమయంలో టీనాతో కలిసి కాంటీన్‌కి వెళ్ళాడు రంగారావు.

"సాయంకాలం పిక్చర్‌కి వెళ్దాం" అన్నాడు.

"పిక్చర్‌కా?" తెల్లబోయింది టీనా.

ఏమి టన్నట్టు కనుబొమ ఎగరేశాడు రంగారావు.

"నిన్ననే ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళా న్సార్!"

రంగారావు కనుబొమలు ముడుచుకున్నాయి. గిరజాల జుట్టు కుర్రాడు డబ్బ పండులాగా మిలమిలలాడుతూ ప్రత్యక్షమయ్యాడు.

"రవితోనా?"

"రవీ, మాధవీ... ఇతర ఫ్రెండ్స్!"

"వెళ్తే ఏం?"

"అమ్మ దెబ్బలాడుతుంది, సార్!"

"నేను తీసుకు వెళ్ళినట్టు తెలిస్తే..."

"అయినా సరే... మగాళ్ళతో కలిసి సినిమా చూడవద్దంటుంది."

"మరి నిన్న రవితో కలిసి చూశావు."

"రవిని నాకు నిశ్చయం చేయాలనుకుంటుంది."

రంగారావుకు పరిస్థితి దుర్భరంగా ఉంది. రవి తన కళ్ళముందు పగలబడి నవ్వుతున్నాడు.

డామిట్! టీనా తనకి కావాలి. సాధ్యమా? తనకి డబ్బు ఉంది. హోదా ఉంది. టీనా తన కింది ఉద్యోగిని. తను కోరితే కాదంటుందా?

తాను పెళ్ళయినవాడు. చాలాకాలం సంసారం చేసినవాడు.

ఇవి రెండూ తనలోని అనర్హతలా?

కావు. తనలో యౌవనం వేడి ఉంది. టీనా తనకి జోడీ!

రవిని టీనాకు నిశ్చయం చేయకుండానే తాను ఆమెను సొంతం చేసుకోవాలి.

"టీనా! నువ్వు కావాలి!" అన్నాడు రంగరావు.

టీనా ఆశ్చర్యపోయింది.

"ఏమిటి, సార్, మీరనేది!"

"నువ్వు ఒప్పుకుంటే నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

"పెళ్ళా? నన్నా? మీరు . ."

"ఏం? చేసుకోకూడదా?"

టీనా కలవర పడిపోతుంది. చేతులు రుద్దుకుంటుంది. కాళ్ళు తొక్కుకుంటుంది. ఆమె చేతిలోని కూల్‌డ్రింక్ వణకుతుంది.

టీనా వెనక్కి తిరిగింది. కూల్‌డ్రింకును బల్లమీద పెట్టింది.

కాంటీన్‌లోంచి పరుగెత్తుతుంది. పులి తరుముతోన్న లేడి లాగా ఉంది టీనా.

రంగారావు ఆమెనే చూస్తున్నాడు.

అతడి కళ్ళలో అయోమయం!

## 4

"టీనా!"

టీనా ఉలిక్కి పడింది.

రవి అరుస్తున్నాడు. కోపంగా తలుపు కొడుతున్నాడు.

టీనా భయంగా కదిలింది. తలుపు తెరిచింది.

రవి కోపంగా వణకుతున్నాడు.

"రవీ!" తెల్లబోయింది టీనా.

"నీకు ముసలాడు కావలసి వచ్చాడా?" గంయ్‌మన్నాడు రవి.

టీనా కళ్ళు మూసుకుంది. పెదిమలు వణుకుతున్నాయి. మాట్లాడదామని ప్రయత్నించింది. ఫలితం లేకపోయింది.

"నువ్వు ప్రొప్రయిటర్‌తో తిరుగుతున్నావు. వాడితో కులుకుతున్నావు. నన్ను మోసం చేశావు. చెప్పు. నువ్వు వాడి డబ్బును చూచి... అంతే! నీ కళ్ళు తిరిగి ఉంటాయి. మన ప్రేమను మరచి..."

"రవీ! ప్లీజ్... నన్ను క్షమించు"

"ఏం? ఎందుకు క్షమించాలి?"

"నేను ఆయనకు మాటిచ్చాను!"

"ఏమని?"

"పెళ్ళి చేసుకుంటానని."

"చీ. ఆ మాట చెప్పడానికి నీకు సిగ్గుగా లేదూ!"

"లేదు."

"బరితెగించావు."

"విషయం తెలిస్తే అలా మాట్లాడవు!"

"ఏమిటో ఆ విషయం?"

"నేను పెళ్ళి చేసుకోకపోతే ఆయన ఆత్మహత్య చేసుకుంటారట!"

"ముసలాడు రోమియో అయాడు.వాడిసంసారాన్ని ఏం చేస్తాడట?"

"నా ఇష్టానికి వదిలి పెట్టారు!"

"అంటే?"

"నేను విడాకు లివ్వమంటే ఆయన రెడీ అట!"

"ఆయన భార్య ఒప్పుకున్నదటనా?"

"ఆఁ!"

"నాన్సెన్స్! ఏ ఆడదీ ఒప్పుకోదు!"

"కాగితం రాసి ఇచ్చింది!"

"నేను నమ్మను. రాత ఆమెది అయిఉండదు."

"ఆల్‌రైట్! అబద్ధం అని నిరూపించు!"

"టీనా! ప్లీజ్ నీకుఏమయింది? నేను ఏం కావాలి?"

"నీకు నా లాంటి అందగత్తె దొరక్కపోదు!"

"ముసలాడి మీద అంత కనికరం పుట్టుకొస్తుందేం?"

"ఆయన మనసు యౌవ్వనంలోనే ఉంది!"

"ఆహా!"

"అయినా నలభై అయిదేళ్ళ వాడు ముసలాడు కాదు!"

"అవున్లే. బిజినెస్ మాగ్నెట్ కదా!"

"ప్లీజ్. నన్ను మాటలతో గాయపరచకు!"

"మీ అమ్మ ఒప్పుకుందా?"

"ఆ!"

"డబ్బూ—డబ్బూ—డబ్బూ!" రవి బయటకు పరుగెత్తాడు.

కారును బయలుదేరతీశాడు.

రంగారావు ఇంటి పోర్టికోలో కారు ఆపాడు. కారు దిగి భవనంలోకి పరుగెత్తాడు.

కృష్ణకుమారి మెయిన్ హాలులో ఉంది.

"ఎవరు కావాలి?" అడిగింది కృష్ణకుమారి.

"మీరు మిసెస్ రంగారావు కదా!" అడిగాడు రవి.

"అవును. ఏం?"

"టీనాను నా నుండి దూరం చేస్తున్నారు."

"ఎవరు?"

"మీరూ...మీ వారూ!"

"నేను నిమిత్తమాత్రురాలిని!"

"ఎలా?"

"ఆయనఇష్టపడ్డారు— మనసును అడ్డం తిప్పడం ఎలా?"

"అందుకని నా ప్రేమలో చిచ్చు పెడతారా?"

కృష్ణకుమారి నవ్వుతుంది. గంభీరంగా నవ్వుతుంది.

"నన్ను కాదని ఆయనా, మిమ్మల్ని కాదని టీనా పరుగులు తీస్తున్నారు. ఆపడానికి మనం ఎవరం?"

"మీ సమాధానం అంతేనా!"

కృష్ణకుమారి నవ్వుతుంది.

అదే నవ్వు...గంభీరమైన నవ్వు.

"మీకు పిచ్చి పట్టి ఉండాలి!"

"పిచ్చి నాకు కాదు! మావారికీ, టీనాకీ మీకూ... మీకు మరి టీనా లాంటి పెళ్ళాం దొరకదా?"

"కాని, ప్రేమించాను."

"ఆమె మిమ్మల్ని కాదని మా వారివెంటపడింది."

"మీ ఆయన ఆత్మహత్య చేసుకుంటాన్నారట!"


"మగాడు లక్ష చెబుతాడు!"

"మీరు అనుమతి ఇవ్వకండి. రెండో పెళ్ళి చేసుకుంటే ఆయనను జైలులో పెడతారు. టీనా రోగం కదుతుంది."

"భర్త లేకుండా బతకలేనా నేను? నా పిల్లలకు నేను తల్లిని! ఇప్పటినుండీ తండ్రినికూడా!"

"మీకు పరిస్థితి పూర్తిగా అర్థం కాలేదు."

"ఇద్దరూ ఒకరికి ఎదురుగా ఒకరు పరుగులు




తీస్తున్నారు. ఢీ కొంటారని చెప్పాను.వాళ్ళకు హోరులో వినిపించలేదు. అనుభవానికి వస్తేనే కాని తెలిసిరాదు!"

మెట్ల మీద అలికిడయింది.

రవి తల తిప్పి చూశాడు. రంగారావు హుషారుగా మెట్లు దిగుతున్నాడు. రవి పళ్ళు బిగబట్టి కరచి బయటకు పరుగెత్తాడు.

"టీనా ఇంకా రాలేదా?"

"రాలేదు."

"నువ్వు బాధ పడటం లేదు కదా!"

"బాధ! బాధ దేనికి? అసలు భర్త మొదట రెండో పెళ్ళి ప్రసక్తి తీసుకు రానేకూడదు. తీసుకు వచ్చాక ఎన్ని అనుకుంటే ఏం లాభం?"

"కృష్ణా!"

"ఏమండీ? నా వలన సంసార సుఖం చాలడం లేదనే కదా మీరు ఆమె వెంట పడ్డారు నేను వద్దనడం లేదు. మీ తృప్తే నా తృప్తి! కాని." క్రిష్ణకుమారి గొంతు పట్టేసింది.

"కృషా! చెప్పు. ఏమిటది?"

"ఏ నాటికయినా ఈ కృష్ణ ఒక్కతె మీ కోసం కాచుకుని ఉంటుందని." కృష్ణకుమారి తల తిప్పింది.

కార్పెట్‌లోకి చుక్కలు ఇంకుతున్నాయి.

## 5

రాత్రి ఎనిమిదవుతూంది.

ప్రొప్రయిటర్ రంగారావు ఫరం ఆఫీసులోంచి బయటకు వచ్చాడు. టీనా అతడి కోసం కారులో వెయిట్ చేస్తూంది.

"సారీ, డియర్! ఆలస్యమయింది!" అన్నాడు రంగారావు.

"ఫరవాలేదు" అంది టీనా.

రంగారావు స్టీరింగ్ వీల్ దగ్గర కూర్చున్నాడు. కారు కదిలింది.

"ఎటు వెళదాం?" అడిగాడు రంగారావు.

కారు దొండపర్తి రోడ్లోంచి పరుగెత్తుతూంది.

"షాపింగ్‌కి వెళదాం అనుకున్నాం కాని, ఆలస్యమయింది కదా!"

"ఎనిమిదే కదా! వెళదాం, పద!"

కారు డాబా గార్డెన్స్ రోడ్లోకి మళ్ళింది.

ఎవరో రంగారావు కారును ఆపారు.

అతడు రంగారావుకు బాల్య స్నేహితుడట...టీనా ఇద్దరి మాటలు వింటూ కూర్చుంది.

"హాయ్, టీనా!"

టీనా తల తిప్పి చూచింది.

మాధవి! ఆమె పక్క ఆమె అన్న కాంత్.

"మా అమ్మ చెబితే అబద్ధం అనుకున్నాను. నిజమే నన్న మాట!" అంది మాధవి.

"నిజమేనే. ఆయన నాకు నచ్చారు. నే నంటే పిచ్చి ప్రేమ!"

"రేపు మా ఇంట్లో పార్టీ ఉంది. మీరు రావాలి" అన్నాడు కాంత్.

"పార్టీయా? ఏమిటి విశేషం?"

"మాధవి తన ఫ్రెండ్స్‌కు పార్టీ ఇస్తూంది."

"తప్పకుండా వస్తాను."

"సాయంత్రం అయిదు గంటలకు." కాంత్ చెయ్యి చాపాడు. టీనా అతడి చేతిలో చేయి వేసింది.

రంగారావును అతడి స్నేహితుడు వదిలాడు.

కారు బయలుదేరి బట్టల దుకాణం ముందు ఆగింది.

బట్టల బేరం సులువుగానే ముగిసింది. దుకాణం లోంచి ఇద్దరూ బయటకు వచ్చారు.

ఎవరో యువకుడు టీనాను సమీపించాడు.

ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు.

అతడు చటుక్కున ఆమె చెయ్యి అందుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు.

రంగారావు వికారంగా చూడసాగాడు.

"మా అంకులా?" అడిగా డతను.

టీనా నిరుత్తరగా చూస్తూంది.

"బై..." అతడు తుఫాన్‌లా దూసుకుపోయాడు.

• • • •

రంగారావు బెడ్‌లైట్ ఆర్పాడు.

గదిలో జీరోబల్బు వెలుగుతూంది.

టీనా బల్ల వద్ద నిలబడి ఉంది. రంగారావు ఆమెను సమీపించాడు. ఆమె మెడ చుట్టూ చేతులు వేశాడు.

"ప్లీజ్, వద్దు" అంది టీనా.

"కాదనకు! అంతవరకూ ఆగలేను!" అన్నాడు రంగారావు.

"మాట మీద నిలబడలేకపోతే ఎలా?"

"టీనా! లోకం దృష్టిలో మనం ఇద్దరమూ భార్యా భర్తలం. రిజిస్టర్డ్ మారేజి కేవలం తంతు."

టీనా విద్భ్రాంతంగా చూచింది.

"నన్ను రిజిస్టర్డ్ మారేజికి ఒప్పించింది మీరే! అంతవరకూ నన్ను తాకనని మాట ఇచ్చిందీ మీరే! ఇప్పుడు రిజిస్టర్డ్ మారేజిని కేవలం తంతు అంటున్నారు!"

"దీంట్లో తప్పు ఏముంది?"

"అవసరం మిమ్మల్ని తరుముతూంది."

"అంటే."

"ప్లీజ్, అర్థం చేసుకోండి! మనకిచట్టసమ్మతంగా పెళ్ళయే వరకూ... మీరిలా చేస్తే నేను మీకు ఉంపుడుకత్తెను కావలసి వస్తుంది!"

"టీనా!"

"అవును. నా హోదా అంతకంటే ఎక్కువకాదు."

"ఛ. ఛ. ఎంత మాటన్నావు?" రంగారావు నొచ్చుకున్నాడు.

• • • •

"అమ్మా! నాన్న ఇంకా రాలేదేం?" అడిగాడు బాబ్జి.

కృష్ణకుమారి వాడి తల మీద చెయ్యి వేసి నిమిరింది. పాప నిద్రపోతూంది.

కృష్ణకుమారి నిట్టూర్చింది. 'బాబ్జికి తండ్రి చేరిక!'

"నాన్న దగ్గరకు వెళతాను!" రాగంతీశాడు బాబ్జి.

"నాన్న వస్తారమ్మా. కాంపు వెళ్ళారేమో!"

"అన్నీ అబద్ధాలు. కాంపు వెళ్ళలేదు. బెడ్డింగ్ ఇంట్లోనే ఉంది."

కృష్ణకుమారి నచ్చచెప్పాలని ప్రయత్నించింది.

బాబ్జి ఏడుపు లంకించుకున్నాడు.

తనకి తోడుగా పడుకుంటున్న పనిమనిషిని లేపింది కృష్ణకుమారి.

"పాపను చూసుకో—బయటికి వెళ్ళి వస్తాను" అంది.

పనిమనిషి మగతగా తలూపింది.

కృష్ణకుమారి తన కొడుకుతో కలిసి బయటకు నడిచింది.

టాక్సీ మాట్లాడుకుంది. టీనా ఇంటి వద్ద దిగింది.

టీనా తల్లి తలుపు తెరిచింది.

గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"అవును ... నీ ప్రేమ నిజమే అయితే నన్ను ... నా కోరిక కాదనకు" అన్నాడు రంగారావు.

"పదే పదే విసిగించకండి!" అంటోంది టీనా.

"నాన్నతో మాట్లాడేది ఎవరు?" అడిగాడు బాబ్జి.

"అవును. నువ్వు నాతో ఎందుకు వస్తావు?" అరిచాడు రంగారావు.

"అంటే!"

"నీకు పడుచువాళ్ళంటే ప్రేమ..."

"నాన్సెన్స్!"

"నిన్ను ఎవడు చూసినా చెయ్యో, కాలో ముద్దు పెట్టుకోనకుండా వదలడు!"

"అభిమానాన్ని ప్రదర్శించడం తప్పా?"

"మనం సంఘంలో బతుకుతున్నాం! పబ్లిక్‌గా గుడ్డలు విప్పుకుని తిరగం."

"నేను అలా తిరుగుతూన్నానా?"

"ఛాతీ కనిపించేలాగా బ్లవుజ వేస్తావు!"

"ఆ ఆకర్షణ చూచే మీరు నా వెంట పడింది. మీకు కావలసింది నా శరీరం! నా మనసు కాదు."

"ప్లీజ్, టీనా ..."

"అమ్మా! నాన్నని పిలువు" అడిగాడు బాబ్జి.

కృష్ణకుమారి వాడిని ఎత్తుకుని పరుగెత్తింది.

"నాన్న దగ్గరికి ..."

బాబ్జి నోరు నొక్కి బయటకు పరుగెత్తుతోంది.

• • • •

కృష్ణకుమారి చీకట్లోకి చూస్తోంది.

నిద్ర రావడం లేదు. పొడి కళ్ళు పడిపోయాయి. ఇరవై రోజు లయింది కంటి నిండా నిద్రపోయి ... ఇరవై యుగా లైనట్లుంది.

ఇరవై రోజుల క్రితం ఆయన ఇంట్లోంచి వెళ్ళిపోయారు. పాతికేళ్ళ అనుబంధాన్ని కాదని వెళ్ళారు. ఆ తర్వాత నాలుగురోజులకే తాను బాబ్జితో టీనా ఇంటికి వెళ్ళింది.

అంతే! ఆయన గొంతును ఆదే వినడం!

తన జీవిత సర్వస్వాన్ని టీనా తన్నుకుపోయింది.

టీనా నవనాగరికురాలు. ఆమెకు బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారు. ఆమె తరం వేరు. తమ తరం వెనకటిది!

వెనకటి తరంలో ఉన్న తన భర్త ఈ తరం అమ్మాయితో ప్రణయం నలుపుతున్నాడు. వాళ్ళ ప్రణయం విజయవంతం కాదని తన మనసు చెప్పింది. కాని, తన అంచనా తప్పింది.

గోడ గడియారం ఠంగ్న అరగంట కొట్టింది.

పదకొండున్నర!

బాబ్జి బెంగపెట్టుకున్నాడు.

తలుపుమీద టకటక చప్పుడయింది.

కృష్ణకుమారి చప్పున పోయి తలుపు తెరిచింది.

రంగారావు!

రంగారావు తల వంచుకుని లోపలకు వచ్చాడు. అతడే తలుపు మూశాడు.

"ఏమండీ!" అంది కృష్ణకుమారి.

"ఏమిటిది? ఏం జరిగింది?"

రంగారావు ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. వెచ్చటి కౌగిలి!

"కృష్ణా! నన్ను క్షమించు!"

ఆమె భర్త నోటికి తన బుగ్గలు అడ్డం పెట్టింది.

"అది త్యాగం చేసిందట! ముసలాడిని ప్రేమించడం! కృష్ణా! నేను ముసలాడినా? చెప్పు..." రంగారావు ఏడుస్తున్నాడు.

కృష్ణకుమారి అతడి బుగ్గలు నిమిరింది.

"మనం ఒకరికొకరం ఎప్పుడూ పడుచువాళ్ళమే!" గుసగుసలాడుతోంది ఆమె.